క్లుప్తంగా

'వసతి'పై నిర్లక్ష్యం వహిస్తే సహించం


విద్యార్థులకు సపర్యలు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

తిరుపతి సిటీ : బాలబాలికల వసతిగృహాలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించే ప్రసక్తే లేదని, దీనిపై వెంటనే దృష్టి సారించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, భగత్‌రవి హెచ్చరించారు. సోమవారం రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేణిగుంట బీసీ హాస్టల్ విద్యార్థులను పరామర్శించారు. పిల్లల ఆరోగ్యస్థితి మనసును కలచివేసిందన్నారు. పేద బిడ్డల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని మండిపడ్డారు. తిరుపతి, రేణిగుంట హాస్టళ్లకు ఒక్కరినే వార్డెన్‌గా నియమించడమేంటని ప్రశ్నించారు.

న్యాయవాది మృతికి సంతాపం

తిరుపతి లీగల్ : తిరుపతికి చెందిన న్యాయ వాది టి.రాజశేఖర్ మృతికి సోమవారం స్థానిక మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్‌లో సంతాప సభ నిర్వహించారు. మూడో అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్, న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు గోపీచంద్, న్యాయవాదులు రాజగోపాల్, కందారపు సుబ్రమణ్యం తదితరులు మాట్లాడుతూ రాజశేఖర్ సేవలను కొనియాడారు. ఆయన మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు రామ్‌గోపాల్, రామచంద్రుడు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వారిలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నేడు రూరల్ మండల మీట్

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. ఎంపీపీ వేముల యశోద అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. గైర్హాజరైన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మధుసూదన్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న మధుసూదన్

తిరుపతి కల్చరల్ : తిరుపతికి చెందిన కె.మధుసూదన్‌కు వాస్తు, జ్యోతిష్య బ్రహ్మ అవార్డు లభించింది. ఈమేరకు సోమవారం హైదరాబాద్ లలిత కళా సమాఖ్య, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠంవారు సికింద్రాబాద్‌లోని హరిహరకళా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అవార్డుతోపాటు సువర్ణ ఘంటా కంకణం బహూకరించారు. నిర్వాహకులు డాక్టర్ వేణుగోపాల్ రావు వీరమనేని, కోమటిరెడ్డి గోపాలరెడ్డి, ధారల క్ష్మణ్‌గుప్త, ఆర్.రవిశంకర్, బ్రహ్మశ్రీ డాక్టర్ వీరభద్రం చేతులమీదుగా ఘనంగా సత్కరించారు.

జెండాల పంపిణీ


జెండాలు పంపిణీ చేస్తున్న నాయకులు

తిరుపతి గాంధీ రోడ్ : నగర బీజేపీ నేతలు 100 జాతీయ జెండాలను సోమవారం పంపిణీ చేశారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి పిలుపుమేరకు ఈ నెల 13, 14, 15 తేదీల్లో హర్ ఘర్ కా తిరంగా కార్యక్రమం కింద ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా ఎగురవేయాలని కోరారు. తిరుపతి హెడ్ పోస్టాఫీస్ సూపరింటెండెంట్ నర్సప్ప, బీజేపీ నేతలు సుబ్రమణ్యంయాదవ్, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, విగ్రహాల కల్యాణి ఆచారి, రాజశేఖరరెడ్డి నాయుడు, చెంగల్రాయులు పాల్గొన్నారు.

స్కావెంజర్స్‌పై సర్వే

తిరుపతి రూరల్ : మండలంలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్ శానిటరీ లెట్రిన్స్‌పై సర్వే చేస్తున్నట్లు ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్ శానిటరీ లెట్రిన్స్ ఉంటే వివరాలను బుధవారం లోపు ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

గ్రామీణాభివృద్ధిపై శిక్షణ

పాకాల : గ్రామీణాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఎల్‌పీఓ రూపారాణి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, చెత్త సేకరణలపై ప్రత్యేకమైన దృష్టి సారించాలని కోరారు. నిధుల వినియోగానికి ప్రణాళిక రూపొందించుకుని అభివృద్ధి పథంలో సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్‌డీ మాలతి పాల్గొన్నారు.

మనసు విరిగె!

తిరుపతిలోని ప్రకాశం పార్కు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. నిత్యం వ్యాయామం చేసేందుకు పెద్దసంఖ్యలో నగర ప్రజలు తరలివస్తుంటారు. పిల్లలు ఆడుకునేందుకు.. పెద్దలు సేదతీరేందుకు పార్కుకు విచ్చేస్తుంటారు. అయితే ఆట పరికరాలు విరిగిపోవడంతో చిన్నారులు మనసు చిన్నబుచ్చుకుంటున్నారు. జిమ్ సామగ్రి శిథిలావస్థకు చేరడంతో ఆరోగ్యం కాపాడుకునేందుకు వచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోకపోవడంతోనే పార్కు దయనీయస్థితి చేరిందని తిరుపతి వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ సిబ్బంది స్పందించి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి









పారిశుద్ధ్య పనుల తనిఖీ


సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో పారిశుద్ధ్య పనులను సోమవారం వేకువజామున మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తనిఖీ చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది పూర్తిస్థాయిలో విధులకు హాజరు కాకపోవడంపై మండిపడ్డారు. విధులకు రాని వారికి కచ్చితంగా ఆబ్సెంట్ వేయాల్సిందేనని , వారి వేతనాలలో కోత విధిందాల్సిందేనని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, వ్యర్థాలు వెంటనే తొలగించేలా ఆయా స్థల యజమానులకు టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణం నోటీసులు జారీ చేయాలని సూచించారు. వారం రోజుల్లోపు నగరంలోని అన్ని ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. గుంతలు పడిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ రెడ్డి, ఎంఈ వెంకటరామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం,డీఈ విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సమష్టిగా 'మత్తు' నిర్మూలనకు కృషి

తిరుపతి సిటీ : మత్తు పదార్థాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో మాదక ద్రవ్యాల నివారణే లక్ష్యంగా పనిచేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడంతోపాటు సమాజాన్ని చైతన్యపరిచేలా అందరికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమానికి వీసీ అప్పారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మనాభం, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ దామోదర్ రెడ్డి, వర్సిటీ చీఫ్ ఇంజనీర్ తాండవకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ టి.దామోదరం పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు

తిరుపతి లీగల్: ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి 2019 సార్వత్రిక ఎన్నికల్లో సమావేశాలు నిర్వహించిన కేసుల్లో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న టీడీపీ నాయకులు సోమవారం తిరుపతి రెండో అదనపు జూనియర్ జడ్జి కోర్టులో హాజరయ్యారు. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు నాయకులపై కేసు నమోదైంది. సోమవారం కోర్టుకు హాజరైన వారిలో మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డాక్టర్ ఆశాలత, డాక్టర్ సుధారాణి ఇతర టీడీపీ నాయకులున్నారు.

ఎస్పీతో ఎస్వీయూ రిజిస్ట్రార్ భేటీ

తిరుపతి క్రైమ్ : ఎస్పీ సుబ్బరాయుడుతో ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు. ఎస్వీయూలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని రిజిస్ట్రార్ కోరారు. ర్యాగింగ్ అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో వాటిల్లే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని సూచించారు.

బాధ్యతగా బాలికల సంరక్షణ

రామచంద్రాపురం: ప్రతి ఒక్కరూ బాధ్యతగా బాలికల సంరక్షణకు కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావనిశ్రీ కోరారు. సోమవారం మండలంలోని సిద్ధేశ్వర ఎస్టీకాలనీలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తకు లేదా 1098కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కారు దగ్ధం

రామచంద్రాపురం: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లె సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు వద్ద సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో ఓ కారు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు. భారతం మిట్టలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న మహాభారత ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలనకు కమ్మపల్లెకు చెందిన వ్యక్తులు కారును డంపింగ్ యార్డు వద్ద నిలిపి వెళ్లారు. తిరిగి వచ్చే సరికి కారు మంటల్లో చిక్కుకుని ఉంది. దీనిపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అయితే కారు అప్పటికే కాలిపోయింది.

ముగిసిన ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు జెండా ఆవిష్కరించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే సంఘంలో సభ్యులుగా ఉండడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, ఉదయ్‌కుమార్, చిన్ని, హరికృష్ణ, చిన్ని, సురేష్, చంద్రనాయక్, మేఘన, భరత్ గణేష్, పవన్ సాయి, మోహన్ పాల్గొన్నారు

చంద్రగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి సాయి కుమార్, కార్యవర్గ సభ్యులు ఉదయ్ కుమార్, నాయకులు శ్రీరాములు, ఓం రాజ్, సాయి, సాంబ, చందు పాల్గొన్నారు.

అబాక్ విద్యార్థులకు అవార్డులు



అవార్డు అందిస్తున్న అబాకస్ శిక్షణ కేంద్రం నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్థానిక బైరాగిపట్టెడలోని ఆర్‌కే అబాకస్ శిక్షణ కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందిన ఎన్ఆర్ఐ విద్యార్థి (నెదర్లాండ్స్) కాలసముద్రం దర్శిల్ అంతర్జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ప్రథమ అవార్డు పొందారని ఆర్‌కే అబాకస్ సంస్థ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత 10 పదేళ్లుగా ఆన్‌లైన్ మాధ్యమంలో వేలాది మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. విజికిడ్ ఎడ్యుకేషన్ చెన్నై వారి ఆధ్వర్యంలో ఏటా జాతీయ, అంతర్జాతీయ పోటీలు నిర్వహించి విజేతలకు అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు వెల్లడించారు.అందులో భాగంగా తల్లిదండ్రుల సమక్షంలో ఈరోజు అవార్డులు ప్రదానం చేస్తున్నామని అబాకస్ డైరెక్టర్ విమల తెలిపారు. కార్యక్రమంలో వీక్ష స్కూల్ హెడ్‌మాస్టర్ ఆర్‌కే విమల, కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి రమాదేవి పాల్గొన్నారు. ఈ నెల 25వ తేదీ ఆదివారం డిస్ట్రిక్ట్ లెవల్ అబాకస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో, అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని వెల్లడించారు. వివరాలకు 99895 00074 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చోరీ కేసులో ఏడాది జైలు

తిరుపతి లీగల్: తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో చిత్తూరుకు చెందిన ఓ బాలుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, జువైనల్ జస్టిస్ బోర్డ్ చైర్మన్ సంధ్యారాణి సోమవారం తీర్పు చెప్పినట్టు పోలీసులు తెలిపారు. తిరుపతి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి బాలుడిపై కేసు నమోదు చేసి జువైనల్ జస్టిస్ బోర్డులో హాజరపరిచారు. అలాగే తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు క్రిమినల్ కేసుల తీవ్రతను, ప్రాధాన్యతను బట్టి కేసుల దర్యాప్తు పోలీసు ఉన్నతాధికారులకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. తీవ్రమైన ఐదు కేసులు డీఎస్పీకి, సాధారణ కేసులు ఆరు సీఐకి, పది కేసులు ఎస్ఐకి కేటాయించి దర్యాప్తు వేగవంతంగా జరిపారు. నేరానికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షలు విధించేటట్టు చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

• వైద్య విద్యార్థుల నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

తిరుపతి తుడా : కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగికదాడికి నిరసనగా సోమవారం ఎస్వీ, స్విమ్స్ వైద్య కళాశాలల వైద్య విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. లైంగిక దాడికి పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సమస్యాత్మకంగా 'గ్రీవెన్స్'


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ డే ఓ ప్రహసనంగా మారిపోయింది. కార్పొరేటర్ల కారణంగా సామాన్య ప్రజలు వినతులు సమర్పించేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కమిషనర్ చాంబర్‌లోకి చొరబడిన కార్పొరేటర్లు గంటల తరబడి కదలక పోవడంతో అర్జీదారులు బయటే నిరీక్షించాల్సి వస్తోంది. దీనిపై కార్పొరేటర్లు మాట్లాడుతూ తమ డివిజన్‌లో అభివృద్ధి పనులు, సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వచ్చామన్నారు. గ్రీవెన్స్‌లో కాకుండా నెలలో రెండు రోజులు కార్పొరేటర్లను కలిసేందుకు కమిషనర్ సమయం ఇస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని వెల్లడించారు. దీంతో ప్రజలు కూడా గ్రీవెన్స్‌లో తమ అర్జీలను సులువుగా అందజేయవచ్చని సూచించారు. ఈ క్రమంలో సోమవారం గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై మొత్తం 62 వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గ్రీవెన్స్‌లో మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకే తొలి ప్రాధాన్యం

తిరుమల: తిరుమలలో శాంతి భద్రతల రక్షణకే తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు డీఎస్పీ కె.విజయశేఖర్ తెలిపారు. సోమవారం తిరుమలలోని పోలీసులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ నేరగాళ్ల కట్టడికి కట్టుదిట్టంగా నిఘా పెట్టాలన్నారు. భక్తులు రద్దీగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ క్రమంలోనే ఎలక్ట్రిక్ బస్‌స్టేషన్, వరాహస్వామి పార్కింగ్ ప్రాంతాలను ట్రాఫిక్ సీఐ శ్రీరాములుతో కలిసి పరిశీలించారు.

ఘనంగా ఏనుగుల దినోత్సవం


ఏనుగులకు పండ్లు తినిపిస్తున్న హరనాథరెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతిలోని టీటీడీ గోశాలలో సోమవారం ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి అధ్వర్యంలో తిరుపతి, తిరుమల, తిరుచానూరు గోశాలల్లోని ఏనుగులు లక్ష్మి, పద్మావతి, పద్మజ, మహాలక్ష్మి, వైష్ణవి, అవనిజ, శ్రీనిధిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక ఆహారం అందించారు.హరనాథరెడ్డి మాట్లాడుతూ దేవదేవేరుల ఊరేగింపులో టీటీడీ సంరక్షణలోని ఏనుగులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. ఏనుగుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.